భారత్‌పై చమురు ధరల ప్రభావం..!

ఒక్కసారిగా పెరిగిన అంతర్జాతీయ చమురు ధరలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై... ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర వంద డాలర్లు దాటిపోయింది. ఈ దేశాలకు చమురు లభ్యం కాకపోవటం ఒక సమస్య అయితే, చమురు వినియోగం పెరిగిపోవటం మరో సమస్య! దాంతో చమురు దిగమతుల బడ్జెట్ పెరిగిపోయి.. ఆర్థిక వ్యవస్థలు కుంగిపోతున్నాయి!!

చమురు వినియోగదేశాలపై చమురు ధరల పెరుగుదల ప్రభావాన్ని ఎలా తగ్గించాలన్నది ప్రస్తుతం ప్రపంచ దేశాల ముందున్న ప్రధాన సమస్య. అధిక ధరలు దేశాల ఆర్థిక వ్యవస్థలపై ద్రవ్యోల్బణ ఒత్తిడిని పెంచుతున్నాయి. ప్రపంచ చమురు మార్కెట్‌లో స్పెక్యులేషన్ కారణంగా.. అంతర్జాతీయ ముడి చమురు ధరలకు రెక్కలొచ్చాయన్నది విశ్లేషకుల అంచనా. ఈ పెరుగుదల ధోరణి ఇప్పట్లో తిరుగుముఖం పట్టే అవకాశాలు లేవని వారు పేర్కొంటున్నారు.

భారీగా పెరిగిన చమురు బిల్లు:

భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి దిశగా దూసుకుపోతోంది. అందుకు అనుగుణంగానే దేశంలో చమురు వినియోగం స్థిరంగా పెరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా చమురు వాడకం ఏటా 2 శాతం పెరుగుతుండగా.. భారత్‌లో ఈ పెరుగుదల 3.6 శాతం ఉండటం గమనార్హం. ఒకవైపు అధిక వినియోగం.. మరోవైపు ధరల పెరుగుదల భారత్ ఆర్థిక వ్యవస్థపై పెను భారాన్ని మోపుతోంది. భారత దేశం తన చమురు అవసరాల్లో 73 శాతం దిగుమతుల ద్వారా భర్తీ చేసుకుంటోంది. దేశంలో మొత్తం చమురు ఉత్పత్తి 33 బిలియన్ టన్నులు. కాగా వినియోగం 100 బిలియన్ టన్నులు. భారత్‌లో రవాణా వ్యవస్థ వేగంగా విస్తరిస్తుండటంతో... ఇతర శక్తి వనరుల లభ్యత కంటే చమురు వినియోగం అధికంగా ఉంది. అంతర్జాతీయ ముడి చమురు ధరలు పెరిగిపోవడంతో.. 2007-08 ఆర్థిక సంవత్సరంలో భారత చమురు దిగుమతుల బిల్లు గణనీయంగా పెరిగిపోయింది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధర బ్యారెల్ 10 డాలర్లు పెరిగితే... భారత స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) ఒక శాతం నష్టాన్ని చవి చూస్తుందని నిపుణుల అంచనా.

ఆయిల్ కంపెనీలపై భారం:

చమురు ధరల పెరుగుదల భారత ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలపై రూ.71,800 కోట్ల భారాన్ని మోపింది. చమరు ఉత్పత్తికి అయ్యే ఖర్చు.. అమ్మకాలపై వచ్చే రాబడి కంటే ఎక్కువగా ఉండటంతో ఈ నష్టాన్ని చవిచూడాల్సి వస్తోంది. అంతర్జాతీయ చమురు ధరలు పెరిగినప్పటికీ దేశీయ మార్కెట్‌లో చమురు ధర పెరగకపోవడం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలను కష్టాల్లోకి నెట్టింది. ఈ దశలో

ప్రభుత్వం వీరిని ఆదుకునేందుకు ఆయిల్ బాండ్లను జారీ చేసి.. 57 శాతం నష్టాన్ని భర్తీ చేయాల్సి వచ్చింది. భారత్‌లో పెట్రోలియం ఉత్పత్తుల చిల్లర ధరలు.. దిగుమతి సుంకం, అంతర్గత రవాణా ఛార్జీలు, ఎక్సైజ్ సుంకం, మార్కెటింగ్ మార్జిన్లు, రాష్ట్ర స్థాయిలో విధించే లెవీలపై ఆధారపడి ఉంటాయి. నిజానికి ఎక్సైజ్, కస్టమ్స్ సుంకాలు, అమ్మకం పన్నులు లేకుంటే.. పెట్రోలు, డీజిల్ ధరలు వరుసగా లీటరుకు రూ.17.50, రూ.18 ఉంటాయి.

దేశీయ చమురు ధరల పెరుగుదల:

యూపీఏ ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 14 నుంచి పెట్రోలు ధర లీటరుకు రూ.2, డీజిల్‌కు రూ.1 చొప్పున పెంచింది. ఆయిల్ ధరలపై ఏర్పడిన మంత్రి వర్గ బృందానికి అధ్యక్షత వహించిన విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జీ... చేసిన సిఫార్సు మేరకు ప్రధాని మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ చమురు ధరలను పెంచాలని నిర్ణయించింది. అంతర్జాతీయ చమురు ధరల పెరుగుదల ప్రభావం నుంచి దేశీయ మార్కెట్‌కు ఊరట కలిగించేందుకు దేశీయ చమురు ధరలపై సుంకాలు తగ్గించాలని కొన్ని రాజకీయ పార్టీలు కోరాయి. అయితే, ఆ సూచనలను రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ వ్యతిరేకించింది. అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకుల వల్ల దేశంలోని సామాన్యుడు ఇబ్బంది పడకూడదని పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి మురళీ దేవ్‌రా అన్నారు. అందుకే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు దివాళా తీయకుండా... కొంతమేర ధరలు పెంచుకునేందుకు అనుమతించినట్లు చెప్పారు. పెట్రోలు, డీజిల్ ధరల పెంపు వల్ల దేశంలోని ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలకు రూ.840 కోట్ల అదనపు ఆదాయం లభిస్తుంది.

ప్రతిపక్ష పార్టీల డిమాండ్లు:

- ఆయిల్ ధరలు పెంచే ముందు ప్రభుత్వం రాబడి తటస్థీకరణ విధానాన్ని అమలు చేయాలి.
- పెట్రోలియంపై పరోక్ష పన్నుల విధానాన్ని పునర్ వ్యవస్థీ కరించాలి.
- యాడ్‌వెలోరం సుంకాల స్థానంలో ప్రత్యేక సుంకాలు విధించాలి.
- ఆయిల్ సెస్సుల ద్వారా లభించిన నిధుల నుంచి పెట్రోలియం ఉత్పత్తులకు ఒక 'ధరల స్థిరీకరణ నిధి'ని ఏర్పాటు చేయాలి.

భారతలో ఇంధన భద్రత:

భారత ఇంధన వనరుల్లో బొగ్గు అతి ప్రధానమైంది. ఆ తర్వాత వరుసగా చమురు, సహజ వాయువు, లిగ్నైట్, జల, అణు విద్యుత్‌లు వస్తాయి. దేశ మొత్తం ఇంధన వినియోగంలో.. బొగ్గు వినియోగం 63.7 శాతం. ఆ తర్వాత చమురు 15 శాతం, సహజ వాయువు 12.7 శాతం, లిగ్నైట్, జల, అణు శక్తి 8.6 శాతం వినియోగం అవుతోంది. భారత్‌లో హైడ్రో కార్బన్ నిల్వలు 30 బిలియన్ టన్నుల మేర ఉంటాయని

అంచనా. చమురు నిల్వలపై సర్వేలు ఇంకా పూర్తికానప్పటికీ.. అపారంగానే ఉన్నాయని భావిస్తున్నారు. ప్రస్తుతం ముడి చమురులో ఎక్కువ భాగం బాంబే హై, ఎగువ అసోం, కాంబే, కృష్ణా–గోదావరి, కావేరీ బేసిన్‌ల నుంచే లభ్యమవుతోంది. భారత దేశంలో ఇప్పటివరకూ కనుగొన్న చమురు నిల్వలు ప్రపంచం లోని మొత్తం చమురు నిల్వల్లో 0.4 శాతం మాత్రమే. అయితే, ప్రపంచ చమురు వినియోగంలో భారత్ వాటా 2.8 శాతంగా ఉండటం గమనార్హం. రాజస్థాన్‌లో చమురు, గోదావరి బేసిన్‌లో అపారంగా సహజ వాయువును కనుగొనటంతో.. దేశీయంగా చమురు, సహజ వాయువు ఉత్పత్తి బాగా పెరిగే అవకాశ ముంది.

ఇంధన భద్రత అంటే...

దేశ ఆర్థిక వ్యవస్థ మనుగడకు నిరంతరాయంగా ఇంధనం లభ్యం కావడం.. ఈ లభ్యత కూడా ప్రపంచ దేశాలు చెల్లించే రేటుకు అందుబాటులో ఉండటమే ఇంధన భద్రత. ఇలా ఇంధన భద్రత కోసం.. చమురు, సహజ వాయువుల వ్యూహాత్మక నిల్వలను ఏర్పాటు చేసుకోవాలి. ఈ దిశగా భారత్ ఇప్పటికే చర్యలు చేపట్టింది. చమురు దిగుమతులకు ఒకే దేశంపై ఆధారపడకుండా.. వివిధ దేశాలతో సంబంధాలు కొనసాగించాలి. ఇంధన రవాణా వ్యవస్థను కూడా విస్తృతపరచాలి. సహజ వాయువును పైప్‌లైన్ల ద్వారా.. ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ)ను ప్రత్యేక నౌకల ద్వారా దిగుమతి చేసు కోవచ్చు. ఇంధన వినియోగంలో పొదుపును పాటించి వీటి దిగుమతులను సాధ్యమైనంత వరకు తగ్గించుకోవటానికి ప్రయత్నించాలి.

సమగ్ర ఇంధన విధానం:

భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత వృద్ధి రేటు తగ్గకుండా.. ఇంధన రంగం అభివృద్ధి చెందే విధానం అవసరం. ప్రస్తుత ఇంధన విధానంలో మార్పులకు ప్రయత్నిస్తున్నామని విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జీ తెలిపారు. ఈ విధానం పెట్రోలియం, సహజ వాయువుల ఉత్పత్తి, వినియోగం, నిర్వహణకు అనుకూలంగా ఉంటుందన్నారు. దేశీయంగా ఇంధన వనరుల వెలికితీతపై శ్రద్ధ, కోల్ గాసిఫికేషన్ వంటి కొత్త అంశాలపై దృష్టిసారిస్తుందని కూడా ప్రణబ్ చెప్పారు. ఇంధన భద్రత కోసం అతి తక్కువ ఖర్చుతో నిరంతరం లభ్యమయ్యే ఇంధన వనరులను గుర్తించి, వాటిని అభివృద్ధి చేయాలన్నారు. ఆ దిశగా ఇప్పటికే పవన, సౌర, జియో థర్మల్, బయోమాస్, హైడ్రోజన్, అణుశక్తి వనరుల అభివృద్ధికి పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. సమగ్ర ఇంధన విధానంతో..ప్రస్తుతం ఉన్న 8–9% వృద్ధి రేటు వచ్చే ఐదేళ్లలో రెండంకెల శాతానికి చేరాలన్నదే లక్ష్యమని చెప్పారు.

బహుముఖ వ్యూహం:

శక్తి వనరులను అందుబాటులోకి తెచ్చేందుకు బహుముఖ వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు కేంద్ర

పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి మురళీ దేవ్‌రా చెప్పారు. ఇందులో భాగంగా స్వేచ్ఛా ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న పోటీని తట్టుకునే విధంగా భారత పెట్రోలియం రంగాన్ని పునర్ నిర్మిస్తున్నారు. చమురు, సహజ వాయువుల వెలికితీతలో ప్రైవేటు, అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యాన్ని పెంచుతున్నారు. 550 మిలియన్ లీటర్ల ఇథనాల్‌ను సేకరించటం ద్వారా .. 5 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడుక విధానాన్ని ప్రభుత్వం అమలు చేయనుంది. దాన్ని త్వరలో 10 శాతానికి పెంచాలన్నదే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచవ్యాప్తంగా సహజ వాయువు వినియోగానికే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. భారత దేశం కూడా అదే దిశలో ఆలోచిస్తోంది.